ప్రతి అక్షరం ప్రజాహితం
RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com
నేటి ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
సంపుటి - 03 సంచిక -159 పేజీలు - 04 వెల - 04/- శనివారం18 జులై 2026

# గత విధ్వంసం నుంచి ఏపీని
# కేంద్రమే నిలబెట్టింది




రుణ వితరణ కార్యక్రమంతో వ్యాపారవేత్తలుగా సామాన్యులు
సంక్షోభంలో ఉన్న రాష్ట్రానికి నిర్మాలాసీతారామన్ సహకారం
కూటమి వచ్చాక రుణాల రీ- షెడ్యూల్‌తో రూ.1538 కోట్లు ఆదా
నరసరావుపేట రుణ వితరణ మేళాలో ముఖ్యమంత్రి చంద్రబాబు
వివిధ వర్గాలకు రూ.3,216 కోట్లు పంపిణీ చేసిన సీఎం, కేంద్ర మంత్రి

**నరసరావుపేట, జూలై 17ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజల వద్దకే వెళ్లి రుణాలు అందించటం గర్వకారణమని, బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువత కలలు నెరవేర్చడానికి, పారిశ్రామికవేత్తల లక్ష్యం నెరవేరడానికి రుణాలు ఎంతో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. గత వైసీపీ పాలనంతా సమస్యల సుడిగుండమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రానికి తిప్పలు తెచ్చిందని, కూటమి అధికారంలోకి వచ్చాకే ఆ రుణాల్ని కేంద్ర సహకారంతో రీ -షెడ్యూలు**మిగతా 2లో...**



# సరికొత్త శకం

## తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

హర్యానాలో జింద్-సోనిపట్ మధ్య పరుగులు పెట్టనున్న హైడ్రోజన్ రైలు
హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం
ఢిల్లీ-కత్రా మధ్య ప్రయాణ సమయాన్ని 14 నుంచి 6 గంటలకు తగ్గించనున్న కొత్త ఎక్స్‌ప్రెస్‌వే
కురుక్షేత్రలో ఎలివేటెడ్ రైల్వే ట్రాక్, కొత్త మెడికల్ కాలేజీలను జాతికి అంకితం

**జూలై 17ఆంధ్ర ప్రగతి**
స్వచ్ఛ ఇంధన రవాణా రంగంలో భారతీయ రైల్వే చారిత్రక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ రైలు, తన ప్రయాణానికి అవసరమైన విద్యుత్‌ను హైడ్రోజన్‌ను ఉపయోగించి స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది **2లో...**







# సమస్యలపై పార్లమెంటులో ప్రస్తావించండి

### నిధులను రాబట్టేందుకు యత్నించండి
### పార్టీ ఎంపిలకు చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి,జూలై 17 ఆంధ్ర ప్రగతి**
తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఆ పార్టీ పార్లమెంటరీ భేటీ జరిగింది. ఈనెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలతో సీఎం చర్చించారు. వివిధ అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టు పురోగతి, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, నిర్వాసితుల పునరావాస కార్యక్రమాలు, రాజధాని నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణపై చంద్రబాబు సూచనలు చేశారు.**మిగతా 2లో...**



# సుదీర్ఘ నిరీక్షణకు తెర..

### ఏపీకి వక్ఫ్ రికార్డులు అప్పగించిన తెలంగాణ

పన్నెండేళ్ల తర్వాత తెలంగాణ నుంచి ఏపీకి చేరిన వక్ఫ్ రికార్డులు
సుమారు 3,503 ఫైళ్లు, 4,050 సర్వే రిపోర్టులు స్వాధీనం
ఇది చారిత్రక విజయమని ఏపీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ వెల్లడి
తెలంగాణ నుంచి రూ. 55 కోట్లు కూడా రావాల్సి ఉందని వెల్లడి




**జూలై 17ఆంధ్ర ప్రగతి**
రాష్ట్ర విభజన జరిగి పన్నెండేళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న ఒక కీలక వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన వేలాది వక్ఫ్ ఆస్తుల రికార్డులను తెలంగాణ వక్ఫ్ బోర్డు ఏపీకి అప్పగించింది. ఈ బదలాయింపుతో గత పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.**మిగతా 2లో...**

# ధరణి అక్రమాలపై సిట్

తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం
ఇక పంచాయితీల నిధులను నేరుగా బ్యాంకులో జమ
ట్రెజరీలో జమచేసే నిబంధన ఎత్తివేసిన కేబినేట్
జగిత్యాల జిల్లా డిగ్రీకాలేజీలో పోస్టు భర్తీకి ఆమోదం
పటాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్లకు భూ కేటాయింపు
బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు ఆమోదం
దేవాదుల, చిన్న కాళేశ్వరం,
పాలమూరు- సీతారామల అంచనా వ్యయాల పెంపు

**హైదరాబాద్,జూలై 17ఆంధ్ర ప్రగతి**
తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా**మిగతా 2లో...**





2లో.

# పెరుగుతున్న కరోనా..

అలర్ట్ అయిన ఏపీ ప్రభుత్వం
దేశ వ్యాప్తంగా పెరుగుతున్న కరోనా కేసులు
ఏపీలో ఇప్పటి వరకు 13కి పైగా కేసుల నమోదు
ఇప్పటికే నలుగురు కోవిడ్ పేషెంట్ల మృతి



Damodar Raja Narasimha

### ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం
# సరికొత్త హెల్త్ స్కీమ్

ఉద్యోగులు, పెన్షనర్లు సహా 17.88 లక్షల మందికి లబ్ధి
డిజిటల్ హెల్త్ కార్డుల ద్వారా సేవలు..
NEHS వెబ్ పోర్టల్ ఆవిష్కరణ
ఉద్యోగుల వాటాకు సమానంగా ప్రభుత్వ వాటా..
ప్రత్యేక ట్రస్ట్ ద్వారా నిధుల నిర్వహణ

**హైదరాబాద్,జూలై 17ఆంధ్ర ప్రగతి**
తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు చిరకాలంగా నిరీక్షిస్తున్న 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' (ఎన్‌ఈహెచ్‌ఎస్) శుక్రవారం లాంఛనంగా ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ **2లో...**మిగతా

### బలాబలాలను బట్టే
# స్థానిక ఎన్నికల్లో పోటీ

స్థానిక ఎన్నికలపై నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు!
స్థానిక ఎన్నికల్లో పాత ఫార్ములా వర్తించదన్న నాదెండ్ల మనోహర్
పార్టీ బలాబలాలను బట్టే స్థానిక ఎన్నికల్లో పోటీ ఉంటుందని స్పష్టీకరణ
సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసమే వెనక్కి తగ్గామన్న వ్యాఖ్య
జనసైనికుల సమస్యల పరిష్కారానికి 'చర్చావేదిక' ప్రారంభం

**అమరావతి, జూలై 17 ఆంధ్ర ప్రగతి**
ఏపీలో సార్వత్రిక ఎన్నికల వేడి చల్లారకముందే స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు స్థానిక ఎన్నికలపై పలు సందర్భాల్లో సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో, సెప్టెంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న ప్రచారంతో ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయిలో **మిగతా 2లో...**



# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలి

రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
-రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్

**అమరావతి, జూలై 17ఆంధ్ర ప్రగతి**
రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సంబందిత శాఖల ఉన్నత అధికారులతో ఆయన సమావేశమై వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక, మత్స్యశాఖలపై ఎల్‌నినో ప్రభావం, ఆయా శాఖలు చేపట్టాల్సిన **మిగతా 2లో...**



# సరికొత్త శకం

**మొదటిపేజీ తరువాయి**

కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తుంది.
ఈ 10 కోచ్‌ల రైలు హర్యానాలోని జింద్, సోనిపట్ మధ్య 90 కిలోమీటర్ల దూరాన్ని కేవలం రెండు గంటల్లో పూర్తి చేస్తుంది. 3,200 హార్స్‌పవర్ సామర్థ్యంతో పనిచేసే ఈ రైలు, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా నిలిచింది. ఈ ఘనతతో హైడ్రోజన్ రైళ్లను నడుపుతున్న అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది.

**రూ.12,470 కోట్లతో రహదారుల అభివృద్ధి**

ఈ కార్యక్రమంతో పాటు హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేసి, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా సుమారు రూ.9,680 కోట్ల వ్యయంతో నిర్మించిన 158 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ–అమృత్‌సర్–కత్రా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ వల్ల ఢిల్లీ–కత్రా ప్రయాణ సమయం 14 గంటల నుంచి 6 గంటలకు, ఢిల్లీ–అమృత్‌సర్ ప్రయాణ సమయం 8 నుంచి 4 గంటలకు తగ్గనుంది. ఇది వైష్ణోదేవి యాత్రికులకు, పర్యాటకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.
అదేవిధంగా అంబాలా–కాలా అంబ్, జింద్–గోహానా జాతీయ రహదారులను కూడా జాతికి అంకితం చేశారు. జింద్–గోహానా రహదారి వల్ల ప్రయాణ సమయం రెండు గంటల నుంచి 40 నిమిషాలకు తగ్గనుంది. హన్సీ–బరవాలా రహదారి విస్తరణ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.

**వైద్యం, మౌలిక సదుపాయాలకు పెద్దపీట**

కురుక్షేత్ర నగరంలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిర్మించిన ఎలివేటెడ్ రైల్వే ట్రాక్‌ను కూడా ప్రధాని ప్రారంభించారు. ఇది రైలు, రోడ్డు రవాణా వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచుతుంది.రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా భివానీలోని పండిట్ నేకీ రామ్ శర్మ ప్రభుత్వ వైద్య కళాశాల, నార్నౌల్‌లోని మహర్షి చ్యవన్ మెడికల్ కాలేజీ, రావు తులారామ్ ఆసుపత్రిని జాతికి అంకితం చేశారు. ఈ సంస్థల ద్వారా హర్యానాలో వైద్య విద్య, ఆరోగ్య సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి.వీటితో పాటు సిక్కు గురువుల చరిత్ర, వారి త్యాగాలు, దేశ సంస్కృతికి వారు అందించిన సేవలను ఆధునిక టెక్నాలజీతో ప్రదర్శించేందుకు కురుక్షేత్రలో నిర్మించనున్న సిక్కు మ్యూజియానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులన్నీ హర్యానా సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తాయని ప్రభుత్వం పేర్కొంది.

# పెరుగుతున్న కరోనా..

## అలర్ట్ అయిన ఏపీ ప్రభుత్వం

**అమరావతి, జూలై 17 ఆంధ్ర ప్రగతి**

దేశంలో మరోసారి కరోనా కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. దేశ వ్యాప్తంగా జులై 1 నుంచి 340కి పైగా కేసులు నమోదయ్యాయి. ఏపీలో కూడా కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. గడిచిన 20 రోజుల్లోనే రాష్ట్రంలో 13కి పైగా కేసులు నమోదయ్యాయి. కడప జిల్లాలో అత్యధికంగా 8 కేసులు నమోదు కాగా, గుంటూరులో 3, విశాఖలో 1, కాకినాడలో 1 కేసు నమోదైంది. మహమ్మారి కారణంగా ఇప్పటికే రాష్ట్రంలో నలుగురు మృతి చెందారు. హోం ఐసోలేషన్‌లో మరో ముగ్గురు ఉన్నారు.
ఆసుపత్రిలో ఇద్దరు కోవిడ్ పేషెంట్లకు చికిత్స అందుతోంది. కృష్ణా జిల్లాకు చెందిన మరో మహిళ కరోనా బారిన పడగా ఆమెకు ఎయిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం కరోనా బారినపడిన పేషెంట్ల శాంపిల్స్‌ను పూణేలోని ల్యాబ్‌కు పంపించారు. కేసులు ఎక్కువగా వస్తుండటంతో ప్రభుత్వం అలర్ట్ అయింది. అధికారులను అప్రమత్తం చేసింది. ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, టెస్టులు అందుబాటులో ఉంచాలని సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారు. కరోనా కేసులపై నేడు మధ్యాహ్నం తర్వాత ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించే అవకాశం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరించాలని, గుంపులు కట్టకుండా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కరోనా నివారణ చర్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

# సుదీర్ఘ నిరీక్షణకు తెర..

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ వక్ఫ్ బోర్డు నుంచి మొత్తం 3,503 ఫైళ్లు, 4,050 సర్వే కమిషనర్ నివేదికలు, రెండు అధికారిక గెజిట్ వాల్యూమ్‌లతో పాటు ఇతర కీలక పత్రాలను ఏపీ వక్ఫ్ బోర్డు అధికారులు స్వీకరించారు. ఇదొక చారిత్రక మైలురాయి అని, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు అవసరమైన కీలక ఆధారాలు ఇప్పుడు తమ వద్ద ఉన్నాయని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.
2014లో రాష్ట్ర విభజన సమయంలో వక్ఫ్ చట్టం–1995 నిబంధనల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన రికార్డులు, ఆస్తులు, నిధులు బదిలీ కావాల్సి ఉన్నప్పటికీ, ఆ ప్రక్రియ దశాబ్ద కాలానికి పైగా స్తంభించిపోయింది. కీలక రికార్డులు అందుబాటులో లేకపోవడంతో ఆస్తుల యాజమాన్య హక్కులను నిర్ధారించడం, ఆక్రమణలను నిరోధించడం, న్యాయస్థానాల్లో కేసులను సమర్థవంతంగా వాదించడం ఏపీ వక్ఫ్ బోర్డుకు పెను సవాలుగా మారింది.ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, ఎన్.ఎం.డి. ఫరూక్ అందించిన సహకారంతో పాటు, తాము జరిపిన ఉన్నత స్థాయి చర్చలు ఫలించాయని అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. ఈ రికార్డుల లభ్యతతో వక్ఫ్ ఆస్తుల నిర్వహణను క్రమబద్ధీకరించడం, వివాదాలను వేగంగా పరిష్కరించడం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. ఇదే క్రమంలో తెలంగాణ వక్ఫ్ బోర్డు నుంచి ఏపీకి సుమారు రూ. 55 కోట్ల నిధులు రావాల్సి ఉందని, అవి కూడా త్వరలోనే విడుదలవుతాయని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హెల్త్ స్కీమ్

**మొదటిపేజీ తరువాయి**

మంత్రి దామోదర రాజనర్సింహ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ అధికారిక పత్రాలతో పాటు, చీజునీూ వెబ్ పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులను వారు ఆవిష్కరించారు.ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4.39 లక్షల మంది ఉద్యోగులు, 3.62 లక్షల మంది పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం 17.88 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. వీరికి 114 ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు అపోలో, యశోద, కిమ్స్, కేర్, స్టార్ వంటి 886 ప్రముఖ కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో నగదురహిత (క్యాష్‌లెస్) వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్‌ఎస్) ధరలకు అనుగుణంగా 1,816 రకాల మెడికల్, సర్జికల్ ప్యాకేజీలను ఈ పథకంలో పొందుపరిచారు.పథకం నిర్వహణ కోసం ఉద్యోగులు, పెన్షనర్లు తమ ప్రాథమిక వేతనం లేదా పెన్షన్‌లో 1.5 శాతం వాటాను విరాళంగా అందజేస్తారు. అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా తన వంతుగా జమ చేస్తుంది. నిధుల నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటిస్తూ ప్రభుత్వ, ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులతో కూడిన ఒక ప్రత్యేక ట్రస్ట్ (ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు చీజునీూ పోర్టల్ ద్వారా తమ డిజిటల్ హెల్త్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.గత ఆరోగ్య పథకంలోని లోపాలను అధిగమిస్తూ, ఉద్యోగ సంఘాల నుంచి అందిన సూచనల మేరకు ఈ సరికొత్త పథకాన్ని అత్యంత పకడ్బందీగా రూపొందించినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జూలై మధ్య నాటికి ఈ నగదు రహిత సేవలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని అధికారులు వెల్లడించారు. ఈ పథకం ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం నుంచి భారీ ఊరటనిస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

# సమస్యలపై పార్లమెంటులో ప్రస్తావించండి

**మొదటిపేజీ తరువాయి**

రాయలసీమకు సాగునీటిని అందించేందుకు చేపట్టాల్సిన గోదావరి–పెన్నా అనుసంధాన పక్రియ, కార్యాచరణపై సీఎం దిశానిర్దేశం చేశారు. దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాలు, రైల్వే భూముల కేటాయింపు, జోన్ పూర్తిస్థాయి కార్యకలాపాల ప్రారంభం అంశాలపై చర్చించారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెట్టే వివిధ చట్ట సవరణలు, కొత్త బిల్లుల పట్ల పార్టీ అనుసరించాల్సిన విధానంపై సమావేశంలో చర్చ జరిగింది. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లు, ఎస్ఐఆర్ అంశాలపై నేతలతో సీఎం చర్చించారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న దుష్ప్రచారం, ఫేక్ న్యూస్ కట్టడి, వ్యవస్థలపై జరుగుతున్న దాడుల అంశాల్లో పార్లమెంట్ వేదికగా లేవనెత్తే విషయంపై చంద్రబాబు పలు సూచనలు చేశారు. ఎంపీలు తమ నియోజకవర్గాల సమస్యలు, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై చర్చించారు.

# బలాబలాలను బట్టే స్థానిక ఎన్నికల్లో పోటీ

**మొదటిపేజీ తరువాయి**

వ్యూహరచనకు పదును పెడుతున్నాయి. ఈ క్రమంలో అధికారంలో ఉన్న టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిలోనూ స్థానిక ఎన్నికల పొత్తులు, సీట్ల పంపకాలపై చర్చ ఊపందుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించిన ఫార్ములా స్థానిక ఎన్నికలకు వర్తించదని, పార్టీ బలాబలాల ఆధారంగానే పోటీ ఉంటుందని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే 2024 సార్వత్రిక ఎన్నికల్లో తమ అధినేత పవన్ కల్యాణ్ పొత్తు నిర్ణయం తీసుకున్నారని మనోహర్ గుర్తుచేశారు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా, వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే లక్ష్యంతో జనసేన కొన్ని సీట్లలో సర్దుకుపోయిందని, నాలుగు అడుగులు వెనక్కి తగ్గిందని అన్నారు. అయితే, ఆ త్యాగాన్ని స్థానిక ఎన్నికల్లోనూ ఆశిస్తే పొరపాటేనని ఆయన స్పష్టం చేశారు.
"సార్వత్రిక ఎన్నికల ఫార్ములానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఉంటుందనడం సరికాదు. స్థానిక పరిస్థితులు, పార్టీ బలం ఆధారంగానే మా పోటీ ఉంటుంది. పొత్తు ధర్మాన్ని పాటిస్తూనే, జనసేన బలంగా ఉన్నచోట కచ్చితంగా పోటీ చేస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. త్వరలో జరగబోయే ఎన్డీయే కూటమి సమావేశంలో ఈ విషయంపై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.పార్టీ బలోపేతం, కార్యకర్తలకు అవకాశాలు కల్పించడంపై కూడా జనసేన దృష్టి సారించింది. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారికి స్థానిక ఎన్నికల్లో తప్పకుండా అవకాశం కల్పిస్తామని మనోహర్ భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే జనసైనికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేసేందుకు 'జనసేన పార్టీ చర్చావేదిక' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిని రాష్ట్రంలో తొలిసారిగా కైకలూరు నుంచి మొదలుపెట్టినట్లు ఆయన ప్రకటించారు. ఈ వేదిక ద్వారా గ్రామస్థాయిలో కార్యకర్తల ఇబ్బందులను తెలుసుకోవడంతో పాటు వైసీపీ సోషల్ మీడియా ద్వారా చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొడతామని వివరించారు. కూటమిగా కలిసి పనిచేస్తున్నప్పుడు చిన్న చిన్న సమస్యలు, అభిప్రాయభేదాలు సహజమని, వాటిని సర్దుకుని ముందుకు సాగాలని జనసైనికులకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ విధ్వంసం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమిలోని అన్ని పార్టీల శ్రేణులు అంకితభావంతో కలిసికట్టుగా పనిచేసి, ప్రభుత్వానికి అండగా నిలవాలని మనోహర్ సూచించారు. మొత్తం మీద స్థానిక ఎన్నికల్లో జనసేన మరింత కీలక పాత్ర పోషించాలని భావిస్తోందని, సీట్ల పంపకాల్లో గట్టిగా బేరమాడేందుకు సిద్ధమవుతోందని మనోహర్ వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది.

# గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

**మొదటిపేజీ తరువాయి**



చేసి రూ.1,538 కోట్లు ఆదా చేశామని అన్నారు. పలనాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణమేళా కార్యక్రమానికి (క్రెడిట్ అవుట్ రీచ్) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలనాడు జిల్లాలో 1,03,246 మంది లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలను అందజేశారు. ఇందులో భాగంగా 15 వేల మంది డ్వాక్రా మహిళలకు,13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. పలనాడు పౌరుషానికి శక్తివంతమైన ఆయుధం ఇస్తున్నాం. క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు ఇలా అర్హులైన వారందరికీ రుణం అందించటమే లక్ష్యం. మహిళా సాధికారతకు ఈ క్రెడిట్ అవుట్ రీచ్ ద్వారా ప్రయోజనాలు చేకూరతాయి. రెండేళ్ల క్రితం రాష్ట్రం అంతా సమస్యల సుడిగుండంలో ఉంది. ఏపీలో ఆర్థిక విధ్వంసం చేశారు. కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఆకాంక్షలు నెరవేరాయి. వీబీజీ రామ్ జీ కింద కేంద్రం నుంచి రూ.7,707 కోట్లు రాష్ట్రానికి వస్తుంది. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్ గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్లు ఆర్థిక సహకారం అందిస్తుంది.ప్రైవేటు పెట్టుబడులతో కలిపి ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మారుస్తాం." అని సీఎం వివరించారు.
"మహిళలందరికీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదర్శంగా నిలుస్తున్నారు. 10 లక్షల డ్వాక్రా సంఘాలు రూ.29 వేల కోట్ల పొదుపుతో దేశంలోనే మేటిగా నిలిచాయి. రుణాల రీ పేమెంట్ లో 99.5 శాతంతో డ్వాక్రా మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు. వారందరినీ మహిళా వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. బ్యాంకింగ్ లో నిర్మలా సీతా రామన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారు. నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం, జన్ ధన్ యోజన ద్వారా కోట్లాది బ్యాంకు ఖాతాలు, జీఎస్టీ శ్లాబ్ లను కుదించి పారదర్శక విధానం తెచ్చారు. వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు కేంద్ర మంత్రి నిర్మల తీసుకొచ్చారు. ఈ తరహా క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాన్ని 6 జిల్లాల్లో నిర్వహించేందుకు తక్షణమే అంగీకరించారు. త్వరలోనే 3 నెలలకు ఒకటి చొప్పున ఈ తరహా కార్యక్రమాలు చేపడతాం." అని ముఖ్యమంత్రి అన్నారుదేశంలోని ప్రతి గ్రామంలోనూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాను ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి బ్యాంకులు ఎన్‌పీఏల సమస్యలతో ఇబ్బందుల్లో ఉండేవని, చిన్న వ్యాపారులు అప్పులు దొరక్క నష్టపోయేవారని గుర్తుచేశారు. చిన్న వ్యాపారుల ఆర్థిక కష్టాలను గుర్తించిన ప్రధాని మోదీ.. ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి బ్యాంకుల ద్వారా వారికి సులభంగా రుణాలు అందేలా పథకాలు తెచ్చారని వివరించారు. నేడు బ్యాంకులు స్వయంగా వ్యాపారుల చెంతకే వచ్చి రుణాలు ఇస్తున్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.
మెగా రుణమేళాలో భాగంగా లబ్దిదారులకు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి రుణ మంజూరు పత్రాలను, చెక్కులను అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేతయూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.42.16 లక్షల విలువైన అంబులెన్స్‌ను పిడుగురాళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. అలాగే నాబార్డు సౌజన్యంతో డీసీసీబీ (ఆఅఅః) కి రూ.25 లక్షల విలువైన 2 మొబైల్ డెమో వ్యాన్లు అందించారు. అలాగే విద్యార్థినులకు రూ.17.80 లక్షల విలువైన 301 సైకిళ్లను పంపిణీ చేశారు. పర్యాటక శాఖకు గ్రామీణ బ్యాంక్ తరపున రూ.14 లక్షల విలువైన 2 బ్యాటరీ వాహనాలను అందించారు. వీటిని సీఎం చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం రామకృష్ణ, పలువురు ఎమ్మెల్యేలు, బ్యాంక్ అధికారులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. సభకు ముందు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అక్కడ ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాళ్లను సందర్శించి, నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలి

**మొదటిపేజీ తరువాయి**

ముందస్తు చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలను క్షేత్రస్థాయిలో పటిష్ఠంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి జిల్లా కలెక్టర్ పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ, అధిక ప్రమాద మండలాలు, రైతు సేవా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.రాష్ట్రంలో జూన్ 1 నుంచి జూలై 15 వరకు సాధారణంతో పోలిస్తే 48.3 శాతం వర్షపాతం లోటు నమోదైందని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ వివరించారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 24 జిల్లాలు లోటు వర్షపాతం, నాలుగు జిల్లాలు తీవ్ర లోటు వర్షపాతం కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. అలాగే 8,489 రైతు సేవా కేంద్రాల్లో 1,357 అధిక ప్రమాదం, 2,077 మోస్తరు ప్రమాదం, 5,055 తక్కువ ప్రమాదంగా గుర్తించగా, రాయలసీమ జిల్లాలు అత్యధిక ప్రమాద ప్రాంతాలుగా ఉన్నట్లు వివరించారు.ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించాలని, రైతు సేవా కేంద్రాలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా నిరంతర పంట సలహాలు అందించాలని సీఎస్ ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించడంతో పాటు, అత్యవసర పరిస్థితులకు అవసరమైన విత్తనాలను ముందుగానే జిల్లాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులకు అనుకూలమైన ప్రీ–మాన్సూన్ డ్రై సోయింగ్ (ఖఓఆూ), ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, తక్కువ నీటితో సాగు చేసే పంటలను మరింత విస్తరించాలని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయాధికారులు ప్రతిరోజూ పరిస్థితులను పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన సూచనలు అందించాలని ఆదేశించారు
××××××××××××××××

# ధరణి అక్రమాలపై సిట్

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడుగంటలపాటు సమావేశమైన మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సందర్భంగా ధరణి, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ ట్రైన్, డిగ్రీ కళాశాలల్లో పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీల ఆదాయం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి.క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ధరణిపై దర్యాప్తునకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయడంతో పాటు ధరణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.గ్రామ పంచాయతీల సొంత ఆదాయం పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలనే నిర్ణయానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు వీలుగా పలు కొత్త పోస్టుల భర్తీకి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే, పఠాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన భూమిని కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక కారణాలు, ప్రయాణికులకు మరింత లబ్ది చేకూర్చేలా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ క్యాబినెట్ సమావేశంలో గ్రామీణ పల్లెల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం–2018 సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా చట్టంలోని సెక్షన్ 70(3)ను సవరించనున్నారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు పన్నులు, ఇతర వనరుల ద్వారా వచ్చే నిధులు, సొంత ఆదాయంప్రభుత్వ ట్రెజరీలో జమ అయ్యేవి. దీనివల్ల అత్యవసర గ్రామ వికాస పనులకు నిధులు డ్రా చేయడం సర్పంచులు లేదా స్థానిక అధికారులకు ఆలస్యమయ్యేది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ, ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీతో సంబంధం లేకుండా నేరుగా సదరు గ్రామ పంచాయతీ బ్యాంక్ ఖాతాలోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు ఆమోదం లభించింది. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగడానికి వీలవుతుంది. ఈ చట్ట సవరణను తక్షణమే అమలుల్లోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేయనుంది. ఈ సమావేశంలో దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని క్యాబినెట్ నిర్ణయించింది. మరోవైపు, మంత్రిమండలి నిర్ణయంతో సిట్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సిట్ ద్వారా భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లపై విచారణ చేపట్టాలని భావిస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలపైనా ప్రత్యేక దృష్టి సారించనుంది. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అవసరమైతే మాజీ అధికారులు, బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని భావిస్తోంది. సాంకేతిక అంశాలపై నిపుణుల సహకారంతో దర్యాప్తు చేపట్టాలని నిర్ణయించింది. ధరణి ద్వారా జరిగిన భూ వివాదాలన్నింటిపైనా వివరాల సేకరణకు కసరత్తు చేస్తోంది. అక్రమంగా లబ్ది పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు, సంబంధిత పత్రాల పరిశీలనను ప్రారంభించాలని తీర్మానించింది. సిట్ ద్వారా ధరణి అక్రమాలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రయత్నాలను ప్రభుత్వం ముమ్మరం చేసింది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం18 జులై 2026

# నీట్-2026లో ఎస్.డీ.ఆర్.ఎస్ ఆకాంక్ష

## జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం.!

**.30కి పైగా ఎంబీబీఎస్ సీట్లపై కన్నేసిన ఆకాంక్ష జూనియర్ కళాశాల విద్యార్థులు. -579 మార్కులతో సత్వా తస్నీం టాప్.**

**..వరుస విజయాలతో మరోసారి సత్తా చాటిన ఆకాంక్ష జూనియర్ కళాశాల విద్యార్థులు.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 17:** దేశ వ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాలకు నిర్వహించిన నీట్-2026 ఫలితాల్లో నంద్యాలకు చెందిన ఎస్.డీ.ఆర్.ఎస్ ఆకాంక్ష జూనియర్ కళాశాల మరోసారి తన ప్రతిభను చాటుకుంది.క్రమశిక్షణతో కూడిన బోధన,అనుభవజ్ఞులైన అధ్యాపకుల మార్గదర్శకత్వం, విద్యార్థుల నిరంతర శ్రమ ఫలితంగా కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. కళాశాల విద్యార్థుల్లో ఎస్.సత్వా తస్నిం 579 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, ఎ.మంజులత 557,ఎ.విష్ణువర్ధన్ రెడ్డి 546,అనిత 542,బి.నర్మత్ 529,షేక్ సనా 517 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు.మరో ఐదుగురు విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. కళాశాల యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం,ఈ ఫలితాల ఆధారంగా 30కి పైగా ఎంబీబీఎస్ సీట్లు సాధించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేసింది.గత ఫలితాల మాదిరిగానే ఈసారి కూడా వైద్య విద్యలో అధిక సంఖ్యలో విద్యార్థులను ప్రవేశింపజేయడమే తమ లక్ష్యమని పేర్కొంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో ఘనంగా విజయోత్సవాలు నిర్వహించారు. కళాశాల చైర్మన్ కొండా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాలతో సన్మానించి అభినందించారు. విద్యార్థులు తల్లిదండ్రులు ,అధ్యాపకులు కేక్ కట్ చేసి,ఆనందోత్సాహాల మధ్య విజయాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. "విద్యార్థుల కృషి,తల్లిదండ్రుల సహకారం,అధ్యాపకుల అంకితభావం వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయి. రానున్న సంవత్సరాల్లో మరింత మంది విద్యార్థులను దేశంలోని ప్రముఖ వైద్య కళాశాలల్లో ప్రవేశింపజేయడమే మా లక్ష్యం" అని తెలిపారు.కళాశాల సాధించిన ఈ ఫలితాలు నంద్యాల జిల్లాకే గర్వకారణమని యాజమాన్యం పేర్కొంది.

## పెట్టుబడి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండండి.

**అధిక లాభాలు వస్తాయనే దురాశకులోనై సైబర్ నేరాల బారిన పడవద్దు.**

**ప్రజలకు జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ విజ్ఞప్తి**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూలై 17:** నంద్యాల జిల్లా ప్రజలకు తెలియజేయునది ఏమనగా, ఇటీవల అధిక లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్, ఫోన్ కాల్స్, నకిలీ వెబ్‌సైట్లు మరియు మొబైల్ యాప్‌ల ద్వారా పెట్టుబడి పేరుతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు జిల్లా సైబర్ క్రైమ్ పోలీసుల ద్వారా మరియు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల పోలీసు అధికారులు తమ పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో మరియు పట్టణాలలో విస్తృతంగా అవగాహన సదస్సులు చేపట్టడం జరుగుతుంది. కానీ కొంతమంది వ్యక్తులు అత్యాశకు గురై సైబర్ నేరగాళ్ల చేతిలో పడి మోసపోతున్నారు. కావున క్రింది జాగ్రత్తలు పాటించి సైబర్ నేరాలకు గురి కావద్దని తెలియజేయడం జరుగుతుంది.

**మీ భద్రత కోసం ఈ సూచనలు పాటించండి:**

తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే పెట్టుబడి పథకాలను నమ్మవద్దు. తెలియని వ్యక్తులు లేదా సంస్థలు పంపిన లింక్‌లను క్లిక్ చేయవద్దు.

ధృవీకరణ లేని యాప్‌లు లేదా వెబ్‌సైట్లలో డబ్బు పెట్టుబడి పెట్టవద్దు.

మీ బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటిపి , యూపీఐ పి ఐ ఎన్ లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ చెప్పవద్దు.

పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ చట్టబద్ధమైనదో కాదో తప్పనిసరిగా నిర్ధారించుకోండి.

జిల్లాలో ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కు కాల్ చేయండి.

లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయండి.సమీప పోలీస్ స్టేషన్‌ను గాని జిల్లా పోలీస్ కేంద్రంలో గల సైబర్ కార్యాలయాన్ని గాని సంప్రదించండి.

**గుర్తుంచుకోండి:** "అధిక లాభాల ఆశతో తొందరపడి తీసుకునే నిర్ణయం, జీవితకాల పొదుపును కోల్పోయే ప్రమాదానికి దారితీస్తుంది."

**ఈ నెల 20వ తేదీ నుండి 31 వరకు దస్తావేజు లేఖరుల**

## పెన్ డౌన్ (సమ్మె) ను జయప్రదం చేయండి.

**-జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు షేక్. ఫరూక్, తోడేటి రమేష్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 17:**జిఓ ఎంఎస్ నెంబర్ 396 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణకు నిరసనగా ఈ నెల 20వ తేదీ నుండి 31 వరకు తమ పనులకు స్వస్థి పలికి పెన్ డౌన్ చేయాలని నంద్యాల జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్. ఫరూక్, తోడేటి రమేష్, కార్యదర్సులు శివరాం, మాలిక్ లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటీకరణ వల్ల ప్రజల ఆస్తులకు భద్రత కోల్పోవడమే కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖరుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది దస్తావేజు లేఖర్ల జీవనోపాధి కోల్పోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సంస్థను ప్రైవేటీకరణ చేయాలని ఉద్దేశంతో పిపిపి విధానాన్ని అమలు చేయబోతుందని, దీనివల్ల ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న దస్తావేజు లేఖరుల జీవనోపాధి, మనుగడ ప్రశ్నార్ధకంగా మారే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖరులు నిరసనలు, సమ్మెలు, పెన్ డౌన్ ల రూపములో ఎన్ని చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యావత్తు దస్తావేజులేఖర్లు తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అలాగే ప్రైవేటీకరణను నిరసిస్తూ జిఓఎంఎస్ నెంబర్ 396ను రద్దుచేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది దస్తావేజు లేఖర్ల జీవనభృతిని కాపాడాలని వారు డిమాండు చేశారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న (11) పది సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల పరిధిలోని దస్తావేజు లేఖర్లు అందరూ పెన్ డౌన్ ప్రకటించడమైనది కాబట్టి ప్రజలందరూ సహకరించవలసిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరుల సంఘ నాయకులు జైలాన్, పిల్లి వెంకటేశ్వర్లు, హుసేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.?

## ఆగస్టు 1 నాటికి "వన్ మంత్ - ఫోర్ విజిట్" అర్జీల పరిష్కారం పూర్తి చేయాలి.

**..రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ తగ్గించాలి.**

**..జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 17:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్దేశిత గడువులోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆళ్లగడ్డ, శ్రీశైలం నియోజకవర్గాల మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారాల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండల స్థాయిలోనే ప్రజా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి నెల నాలుగు శుక్రవారాలు ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని సకాలంలో పరిష్కరించడం అధికారుల ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. ఆళ్లగడ్డ మండలంలో ఇప్పటివరకు 838 అర్జీలు స్వీకరించగా 680 పరిష్కరించి 158 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. చాగలమర్రి మండలంలో 351 అర్జీలకు గాను 209 పరిష్కరించి 142 పెండింగ్‌లో ఉండగా, రుద్రవరం మండలంలో 326 అర్జీలకు గాను 181 పరిష్కరించి 145 పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. ఈ మూడు మండలాల్లో ప్రధానంగా రెవెన్యూ సంబంధిత దరఖాస్తులే అధికంగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, వాటిని ఆగస్టు 1వ తేదీలోపు పూర్తిగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

అలాగే శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు, మహానంది మండలాల్లో పెండింగ్‌లో ఉన్న అర్జీలను కూడా ఆగస్టు 1వ తేదీలోపు పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. మిగిలిన మండలాల్లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వచ్చే శుక్రవారం నాటికి పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పెండింగ్‌కు గల కారణాలపై కలెక్టర్ అధికారులను ప్రశ్నించగా, ఆర్ఓఆర్ సంబంధిత నోటీసులు జారీ చేసినట్లు, 22-ఏ ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపిస్తున్నట్లు సంబంధిత అధికారులు కలెక్టర్ కు నివేదించారు. శుక్రవారం వెలుగోడులో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో 550 కొత్త అర్జీలు స్వీకరించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్, సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టాలి.

**ప్రతి అర్జీపై క్షేత్రస్థాయిలో విచారణ తప్పనిసరి.**

**-వన్ మంత్‌ఫోర్ విజిట్'లో వెలుగోడులో ప్రత్యేక గ్రీవెన్స్ వేదిక.**

**వెలుగోడు అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రల పంపిణీ.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూలై 17:** ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని సానుకూల దృక్పథంతో పరిశీలించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. 'వన్ మంత్ - ఫోర్ విజిట్' కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ లు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు, సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీని పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యల కోసం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 'వన్ మంత్ - ఫోర్ విజిట్' కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వీలైనంత త్వరగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించదగినవైతే, మరికొన్ని చట్టపరమైన లేదా ఆర్థికపరమైన అంశాలతో ముడిపడి ఉంటాయని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా స్పందించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, అర్జీదారులతో స్వయంగా మాట్లాడిన అనంతరమే నివేదికలు సమర్పించాలని సూచించారు. కేవలం పైపైన పరిశీలించి సమస్య పరిష్కారమైందని నమోదు చేస్తే తీవ్రంగా పరిగణిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి ప్రధానంగా భూ సమస్యలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, నిలిచిపోయిన భవనాల పనులు పూర్తి చేయడం, గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం వంటి అభివృద్ధి పనులకు సంబంధించిన అర్జీలు అధికంగా వస్తున్నాయని తెలిపారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యలను గ్రామ స్థాయిలోనే గుర్తించి వేగంగా పరిష్కరించేందుకు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెలుగోడు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇప్పటికే నియోజకవర్గంలోని రెండు మండలాల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని, మిగిలిన మండలాల్లో కూడా వచ్చే వారం నుంచి ప్రతి శుక్రవారం ఈ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

అనంతరం వెలుగోడు మండల పరిధిలోని 20 అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం తయారు చేయడానికి అవసరమైన ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రలు (యుటెన్సిల్స్)ను జిల్లా కలెక్టర్, శ్రీశైలం ఎమ్మెల్యే సంయుక్తంగా పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పోషకాహారాన్ని పరిశుభ్రంగా, సురక్షితంగా తయారు చేసేలా అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించాలని సిబ్బందికి సూచించారు.

1) వెలుగోడు మండలం, అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన చింతకుంట రాముడు తనకు గతంలో ప్రభుత్వం నుండి 0.50 సెంట్ల వ్యవసాయ భూమి మంజూరు చేశారని, చుట్టుపక్కల ఉన్న భూములు ఆక్రమణకు గురవుతున్న సందర్భంగా రీసర్వే చేసి తన భూమిని తనకు ఇప్పించగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

2) వెలుగోడు మండలానికి చెందిన సయ్యద్ ఖలీల్ కు బోయరేవుల గ్రామంలో సర్వే నెం.265ఎలో 4.94 సెంట్ల భూమి చుక్కల భూమిగా నమోదు అయ్యిందని, సదరు భూమిని చుక్కల భూమి జాబితా నుండి తొలగించగలరని జిల్లా కలెక్టర్ కు అర్జీ అందజేశారు.

3) వెలుగోడు మండలానికి చెందిన వాడం శివకృష్ణ తనకు ఎలాంటి సొంత ఇల్లు లేదని, ఇంటి స్థలం మంజూరు చేయగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు, వెలుగోడు మండల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# జూలై 25న ఆస్పరిలో సీఎం పర్యటన

## - పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి. -..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.

## .హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 17:** ఈ నెల 25వ తేదీన ఆస్పరి మండల కేంద్రంలో నిర్వహించనున్న "సంజీవని" కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆస్పరి మండల కేంద్రం ఆలూరు రోడ్డులో ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్, బహిరంగ సభా ప్రాంగణం, పార్టీ క్యాడర్ సమావేశ స్థలం, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, ప్రధాన రహదారులను సంబంధిత అధికారులతో కలిసి తనిఖీ చేసి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ...ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా, భద్రతా నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని పనులను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు సమర్థవంతంగా చేయాలని తెలిపారు. వాహనాల రాకపోకలకు అనువుగా ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని పోలీసు అధికారులకు సూచించారు. అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపు చేపట్టి, అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని తెలిపారు. ప్రజలకు ట్రాఫిక్ మార్గాలపై ముందస్తు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలకు వెళ్లే రహదారులను పరిశీలించిన కలెక్టర్, మరమ్మతులు అవసరమైన చోట వెంటనే పనులు చేపట్టి కార్యక్రమానికి ముందే పూర్తి చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ క్షేత్ర స్థాయి పరిశీలన లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా,ఆర్డీవో చిన్న ఓబులేసు, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మనాభ రెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ , ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# హౌస్ బ్రేకింగ్ కేసును వేగంగా ఛేదించిన పాణ్యం పోలీసులు.

## ముద్దాయి అరెస్ట్, రూ.3.24 లక్షల నగదు స్వాధీనం.

**ఆంధ్ర ప్రగతి పాణ్యం జూలై 17:**



2026 జూలై 12వ తేదీ సాయంత్రం పాణ్యం మండలం కొండజూటూరు గ్రామానికి చెందిన శ్రీమతి వన్నం విజయలక్ష్మి ఇంటిలో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాన్ని ఉపయోగించి లోనికి ప్రవేశించి, బీరువాలో ఉన్న నగదు రూ.3,24,000/-ను అపహరించారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పాణ్యం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నంద్యాల జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సునీల్ షొరాన్,ఆదేశాల మేరకు, నంద్యాల అదనపు పోలీసు సూపరింటెండెంట్ శ్రీమతి సుష్మిత, ఐపీఎస్ పర్యవేక్షణలో, పాణ్యం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి మరియు పోలీసు సిబ్బంది సూర్య, నాగరాజు, వెంకటేష్ నాయక్, నాగార్జునలు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, సాంకేతిక ఆధారాలను సేకరించి ముమ్మర దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా, కొండజూటూరు గ్రామానికి చెందిన మంజలి వెంకట రమణ (తండ్రి: లక్ష్మణ్, వయస్సు: 36 సంవత్సరాలు)ను 17-07-2026 తేదీ ఉదయం కొండజూటూరు గ్రామ శివారులోని కొట్టాల రహదారి సమీపంలోని మామిడి తోటలో అరెస్ట్ చేశారు.

ముద్దాయి వద్ద నుంచి చోరీకి గురైన నగదు రూ.3,24,000/-తో పాటు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముద్దాయిని న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్‌కు పంపించింది.కేసును అత్యంత వేగంగా ఛేదించి, చోరీకి గురైన నగదును పూర్తిగా రికవరీ చేసిన పాణ్యం సీఐ, ఎస్ఐ మరియు దర్యాప్తు బృందాన్ని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాన్, ఐపీఎస్, అదనపు ఎస్పీ శ్రీమతి సుష్మిత, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

**ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి** :ఇంటి తాళాలను ఇంటి బయట గూళ్లలో, బట్టల కింద, బాత్‌రూమ్ గూళ్లలో లేదా ఇతరులకు సులభంగా కనిపించే ప్రదేశాల్లో ఉంచకుండా జాగ్రత్త వహించాలి. ఇలాంటి నిర్లక్ష్యం చోరీలకు అవకాశం కల్పించే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# బాలికలకు పుస్తకాల పంపిణీ.

## ..నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో. .కశెట్టి చంద్రశేఖర్ సౌజన్యంతో.

## ..ఇరవై అయిదు వేల రూపాయల విలువైన పుస్తకాల పంపిణీ.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూలై 17:** నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లియో క్లబ్ సభ్యురాలు కశెట్టి తన్మయి తన జన్మదినోత్సవ సందర్భంగా మహానంది రోడ్డులో ఉన్న ఎయిమ్ ఫర్ సేవ బాలికల చాత్రాలయంలో,ఇరవై అయిదు వేల రూపాయల ఖరీదైన పుస్తకాలను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ,జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ తన్మయి గత కొన్ని సంవత్సరాలుగా తన పుట్టిన రోజు సందర్భంగా బాలికలకు అవసరమైన పుస్తకాలను ఇవ్వడంప్రశంసనీయమన్నారు.పుట్టిన రోజు సందర్భంగా యువత వేడుకల కోసం అధిక ధనం వ్యయం చేయడం కన్నా ఆ రోజున అవసరమున్న చోట సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు.అభిరుచి మధు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా మనకు ఎంతో తృప్తిని, ఆనందాన్ని ఇస్తుందని అన్నారు. నంద్యాల లయన్స్ క్లబ్ సేవలుప్రశంసనీయమన్నారు. కశెట్టి చంద్రశేఖర్ తన కుమార్తె తన్మయి పుట్టిన రోజు సందర్భంగా ప్రతి ఏటా ఈ సేవా కార్య క్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా బాలికల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో దాత కశెట్టి చంద్రశేఖర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్, కార్యదర్శి మేడా చంద్రశేఖర్, కోశాధికారి సురేష్, రీజనల్ చైర్మన్ నిజాముద్దీన్, జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు,సీనియర్ సభ్యులు చంద్ర మోహన్, పోసిన సుబ్బా రావు,యూసఫ్,డాక్టర్ కార్తికేయ,జగన్, ఛాత్రాలయ నిర్వహకులు మోక్షేశ్వరుడు, చాత్రాలయంలో ఉన్న బాలికలు పాల్గొన్నారు.

# కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

## ..ఆస్పరి మండలం బిలేకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.





**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూలై 17:**

:విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పిలుపునిచ్చారు.శుక్రవారం ఆస్పరి మండలం బిలేకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యాభివృద్ధి, బోధన, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, మౌలిక వసతులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అన్ని సౌకర్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాల యూనిఫామ్‌లు మరో రెండు రోజుల్లో అందజేయనున్నట్లు తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, భోజనం రుచిగా నాణ్యతగా ఉండాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండి చదువులో మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందాయా, ఉపాధ్యాయులు సమర్థవంతంగా బోధిస్తున్నారా, స్లిప్ టెస్టులు క్రమం తప్పకుండా రాస్తున్నారా, గణితశాస్త్రంపై పట్టు ఉందా వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పరీక్షను అవకాశంగా తీసుకొని అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలని సూచించారు. పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లకు సంబంధించిన సమస్యలను విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వినియోగాన్ని తగ్గించాలని, పరిశుభ్రమైన నీటిని మాత్రమే తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్న మెగా పేరెంట్స్-డే కార్యక్రమానికి ప్రతి విద్యార్థి తన తల్లిదండ్రులను స్వయంగా ఆహ్వానించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అందించిన ఆహ్వాన పత్రికలను స్వయంగా అందజేసి కార్యక్రమానికి తప్పకుండా తీసుకురావాలని తెలిపారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యా పురోగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. లీప్ యాప్ వినియోగంపై విద్యార్థులను ప్రశ్నించిన కలెక్టర్, ప్రతి తల్లిదండ్రి తమ మొబైల్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పిల్లల హాజరు, చదువు, విద్యా పురోగతిని నిరంతరం పరిశీలించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే ప్రతి సూచన విద్యార్థుల భవిష్యత్తు కోసమేనని పేర్కొన్న కలెక్టర్, పెద్దలను గౌరవిస్తూ వారి మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. పాఠశాలలో మొక్కలు నాటారా అని అడిగిన కలెక్టర్, మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి విద్యార్థి స్వీకరించాలని సూచించారు. వేప, నేరేడు, గానుగ వంటి ఉపయోగకరమైన మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు సోషల్ మీడియాలో సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. డ్రగ్స్, మాదకద్రవ్యాలు, ఇతర చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని, ఆత్మ నియంత్రణతో జీవిస్తేనే విజయాన్ని సాధించవచ్చని అన్నారు. ముఖ్యంగా బాలికలు చిన్న వయసులో వివాహం గురించి ఆలోచించకుండా ఉన్నత విద్యను లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగాలని సూచించారు. ఇంటిలో వివాహం చేయాలి అని చూస్తూ ఉంటే వెంటనే టీచర్ లకు సమాచారం అందించాలని సూచించారు. కలెక్టర్, వైద్యుడు, ఇంజినీర్, పోలీస్ అధికారి,ఉపాధ్యాయుడు వంటి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదవాలని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు. ప్రతి విద్యార్థి విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, తల్లిదండ్రుల భాగస్వామ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి విద్యార్థి కుటుంబానికి, సమాజానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

పాఠశాలకు అవసరమైన నాలుగు అదనపు గదుల నిర్మాణానికి వెంటనే ఎస్టిమేషన్ లు, ప్రణాళికలు వేయించి పంపవలసిందిగా హెడ్మాస్టర్ ను కలెక్టర్ ఆదేశించారు. స్కూలుకు ఉన్న త్రాగునీరు , కాంపౌండ్ వాల్ , కరెంట్ సమస్యలు పిఓ ఎస్ ఎస్ ఏ కు ఫోన్ ద్వారా వివరించి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు.

బిలేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పర్యటనలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ , స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు జిల్లా అధికారి భాస్కర్ నాయుడు, పత్తికొండ ఆర్డిఓ చిన్న ఓబులేసు , పత్తికొండ తహసిల్దార్ మల్లికార్జున రెడ్డి , ఎంపీడీవో గీతా వాణి, ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేశ్వర్లు,ఎం ఈ ఓ తిరుమల రావు, హెడ్మాస్టర్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు గోకారి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చే సంజీవని ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

## ..ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.





**ఆంధ్ర ప్రగతి కర్నూలు , జూలై 17:** ఈ నెల 25వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి శుక్రవారం ఆస్పరి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, వైద్య సేవల అందుబాటు, మౌలిక వసతులను పరిశీలిస్తూ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో సాధారణ ప్రసవాలు అత్యధికంగా జరుగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆస్పరి కేంద్రం ఒకటిగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్య సిబ్బంది మరింత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజూ ఎంతమంది ఓపీ సేవలు పొందుతున్నారో, నెలకు ఎన్ని ప్రసవాలు నిర్వహిస్తున్నారో సంబంధిత వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు సేకరించారు. ఆసుపత్రిలోని రక్త పరీక్షల గది, సంజీవని అరినా కేంద్రం, మెడికల్ ఆఫీసర్ గది, ఫార్మసీ, ఆరోగ్య మిత్ర హెల్ప్ డెస్క్, ప్రసూతి (కాన్పుల) గది, ఇతర వార్డులు, ఆసుపత్రి ప్రాంగణాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశుభ్రత, వైద్య పరికరాల వినియోగం, రోగులకు అందుతున్న సేవలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా సంజీవని కార్యక్రమాన్ని ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచే ప్రారంభిస్తున్నందున, అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు అత్యంత పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రిలో అవసరమైన చిన్నచిన్న మరమ్మత్తులు, రంగులు వేయడం, పరిశుభ్రత, విద్యుత్, తాగునీరు, సూచిక బోర్డులు, రోగులకు అవసరమైన సౌకర్యాలను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం నిమిత్తం బిల్లేకల్ గ్రామం నుండి వచ్చిన భానుతేజ్ ( మూడు సంవత్సరాలు), ముత్తుకూరు గ్రామస్తులు పులికొండ (56 సంవత్సరాలు) ను జిల్లా కలెక్టర్ పలకరిస్తూ ఇక్కడ వైద్యులు బాగా చూస్తున్నారా వైద్యం బాగా చేస్తున్నారా పరీక్షలు బయట చేయించుకోమని రాస్తున్నారా? మందులు బయట కొనమని రాస్తున్నారా అని అడిగారు. అతను వైద్యం బాగా అందిస్తున్నారని పరీక్షల కొరకు బయట రాయడం లేదని సమాధానం ఇవ్వగా జిల్లా కలెక్టర్ సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, జిల్లా టి.డి.పి నాయకులు గుడిసె కృష్ణమ్మ , ఆలూరు ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీమాతో కుటుంబాలకు ఆర్థిక భద్రత

## ప్రతి ఉద్యోగి కుటుంబానికి బీమా పథకాలపై అవగాహన ఉండాలి.

## కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జూలై 17:** బీమా పథకాల ద్వారా కుటుంబాలకు ఆర్థిక భద్రత కలుగుతుందని, ప్రతి ఉద్యోగి అందుబాటులో ఉన్న బీమా, సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. నగరపాలక సంస్థలో రెగ్యులర్ ఉద్యోగి (పిహెచ్ వర్కర్) గా పనిచేస్తూ ఇటీవల మరణించిన బైరపోగు దేవరాజు ఎస్‌బీఐ శాలరీ ఖాతాకు అనుబంధంగా ఉన్న బీమా పథకం ద్వారా మంజూరైన రూ.10 లక్షల బీమా చెక్కును శుక్రవారం కమిషనర్ మృతుడి కుమారుడికి అందజేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బీమా పథకాలు ఉద్యోగుల కుటుంబాలకు క్లిష్ట సమయంలో ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి తనకు లభించే బీమా, సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకొని వాటి ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.నగరపాలక సంస్థలో రెగ్యులర్ ఉద్యోగి విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.1 కోటి, సహజ మరణం సంభవిస్తే రూ.10 లక్షల బీమా ప్రయోజనం అందించే ఎస్‌బీఐ బీమా పథకాలు అమలులో ఉండటం అభినందనీయమని కమిషనర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ రఘునందన్, ఎస్‌బీఐ బ్యాంకు రీజినల్ మేనేజర్ సురేష్ బాబు, రీజినల్ కార్యాలయ సిబ్బంది గుప్తా, పుల్లమ్మ, కేఎంసీ బ్రాంచ్ మేనేజర్ సూర్య, ఉద్యోగుల సంఘ నాయకులు జియా, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# హాట్‌హాట్‌గా సాగనున్న పార్లమెంట్ !

**జూలై 17 ఆంధ్ర ప్రగతి**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు సమయం ఆసన్నమైంది. ఈ సమావేవాలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకోబోతున్నాయి. ఈ క్రమంలో ఎవవరి వ్యూహాల్లో వారు ఉన్నారు. విపక్ష పార్టీలు కూడా తగిన వ్యూహాలతో సిద్దం అవుతున్నారు. అధికార పార్టీ వేసే ఎత్తుగడలకు ధీటుగా నిలవాలని ఇండియా కూటిమి సన్నద్దం అవుతోంది. సోమవారం నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత జరుగుతున్న సమావేశాలు కాబట్టి ఈసారి హాట్‌హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ వ్యూహం సిద్ధం చేసింది. అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, విద్యా వ్యవస్థలో అవ్యవస్థలు, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు వంటి కీలక అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించింది. అలాగే నియోజక వర్గాల పునర్విభజన, మంత్రులు-ముఖ్యమంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. డీలిమిటేషన్‌పై అఖిలపక్ష భేటీ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే అధికార ఎన్‌డిఎ పెద్దగా పట్టించుకోవడం లేదు. గత పార్లమెంట్ సమావేశాలకు ముందు కూడా ఇలాంటి డిమాండ్ వచ్చింది. అయినా కేంద్రం పెద్దగా పట్టించుకోలేదు. పార్లమెంటులో చర్చించే ముందు అఖిలపక్షంతో చర్చించడం ఆనవాయితీ ఉండేది. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత దానిని తుంగలో తొక్కారు. అఖిలపక్షాలు ఏర్పాటు చేయడం, చర్చించడం మోడీకి పెద్దగా ఇష్టం ఉండదని గత 12 ఏళ్లుగా చూస్తున్నాం. ఇకపోతే జూలై 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశమై వ్యూహాన్ని ఖరారు చేసుకుంది. రామ మందిర విరాళాల దుర్వినియోగం, ప్రశ్నాపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో క్షీణత, రాజ్యాంగ సంస్థల బలహీనత, రాజకీయ పార్టీల విభజన, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు, ఎథనాల్ మిశ్రమ ఇంధన విధానం, అటవీ నరికివేత, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల హక్కులపై దాడులు వంటి అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జునఖర్గే తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీలిమిటేషన్ బిల్లును మళ్లీ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్.. ఆరోపించారు. ఏప్రిల్ 17న ప్రభుత్వం రెండు మూడవ వంతు మెజారిటీ సాధించడంలో విఫలమైందని, ఇప్పుడు మరోసారి అదే బిల్లును తీసుకురావాలని చూస్తోందన్నారు. డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్ గతంలో ఎలా వ్యతిరేకించిందో ఇప్పటికీ అదే వైఖరి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే 30 రోజుల పాటు జైలులో ఉన్న మంత్రులు, ముఖ్యమంత్రులను పదవి నుంచి తొలగించే రాజ్యాంగ సవరణ బిల్లును కూడా తీవ్రంగా



వ్యతిరేకిస్తామని వెల్లడించారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ అంశంపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ జేపీసీపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు జైరాం రమేష్ తెలిపారు. అలాగే వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు, జాతీయ ఆహార భద్రత చట్టం-2013 సవరణలు వంటి బిల్లులను కూడా కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం తీసుకురానున్న శాసనసభ్య కార్యక్రమాల్లో కాంగ్రెస్ మద్దతు ఇవ్వగల బిల్లు ఏదీ కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్‌ను ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగానే అమలు చేస్తే కాంగ్రెస్ పూర్తిగా మద్దతు ఇస్తుందని జైరాం రమేష్ స్పష్టం చేశారు. అమిత్ షా రాజకీయ పార్టీలను చీల్చి రెండు మూడవ వంతు మెజారిటీ సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన.. అది రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి అవమానమని విమర్శించారు. అయితే బీజేపీకి లోక్‌సభలో రెండు మూడవ వంతు మెజారిటీ సాధ్యం కాదని
ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు ఇండియా కూటమి సోమవారం వ్యూహ సమావేశం నిర్వహించనుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆదివారం అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశమై వర్షాకాల సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై చర్చించనుంది. జూలై 20 నుంచి ప్రారంభ మయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులతో పాటు పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మరోవైపు నీట్ ప్రశ్నాపత్రాల లీక్, రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెరుగుతున్న చమురు ధరలు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. కేంద్రం కూడా తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా వ్యవహరిస్తోంది. దేశం అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నా, వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. వాటిపై చర్చించి నిర్ణయం తీసుకునే చొరవ కూడా తీసుకోవడం లేదు. మొత్తంగా ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు ప్రవేశ పెడితే ఎలా నెగ్గుకు వస్తారన్నదే ఆసక్తిగా మారింది. మహిళా బిల్లును కలిపే పెడతారా అన్నది తెలియదు. అఖిలపక్షంలో చర్చించేందుకు ఎందుకనో మోడీ ఇష్టపడడం లేదని తెలుస్తోంది. అదేదో పార్లమెంటులోనే చర్చించాలన్నది ఆయన వ్యూహంగా ఉన్నట్లు అర్థం అవుతోంది.


## కొల్లేరులో కాలుష్యంపై సుప్రీంకోర్టు కమిటీ ఆగ్రహం



**ఏలూరు,జూలై 17 ఆంధ్ర ప్రగతి** కొల్లేరులో కాలుష్యం పెరగడంపై సుప్రీంకోర్టు కమిటీ ఆగ్రహం వ్యక్తంచేసింది. కొల్లేరు లేక్ ప్రొటెక్షన్ కేసులో కలెక్టర్‌కు కీలక ఆదేశాలు జారీ చేసింది. అక్రమ చేపల చెరువుల ధ్వంసానికి అటవీశాఖకు సహకరించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. స్థానిక యంత్రాంగం సహకరించడం లేదని, కూల్చివేతలకు అడ్డు తగులుతున్నారని అటవీ పర్యావరణశాఖ.. కమిటీకి ఫిర్యాదు చేసింది. తక్షణమే రంగంలోకి దిగాలని ఏలూరు జిల్లా కలెక్టర్‌ను ఈ మేరకు కేంద్ర సాధికార కమిటీ ఆదేశించింది. మరోవైపు పక్షుల మనుగడ ప్రమాదంలో పడటంపై పిటిషనర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో కొల్లేరు సరస్సు కలుషితంపై సమగ్ర వివరణ ఇవ్వాలని ఏపీ ప్రభుత్వాన్ని కమిటీ ఆదేశించింది. అక్రమ చెరువులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంపై కమిటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కూల్చివేతల పురోగతితో పాటు కాలుష్య నివారణ చర్యలపై నివేదిక సమర్పించాలని పేర్కొంది.

## మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు మంచినీరు

### మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు నిర్ణయం



**హైదరాబాద్,జూలై 17 ఆంధ్ర ప్రగతి**
హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మల్లన్నసాగర్ జలాశయం నుంచి రోజుకు అదనంగా 25,30 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీలు) నీటిని తరలించాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు నిర్ణయించింది. సింగూర్, మంజీర జలాశయాల్లో నీటి నిల్వలు వేగంగా తగ్గుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపడుతోంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా మల్లన్నసాగర్ నీటిని హైదరాబాద్‌కు మళ్లించేందుకు సుమారు 4 కిలోమీటర్ల కొత్త పైప్‌లైన్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు లభించాయి. ఈ పనులను 50 నుంచి 60 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశిరచారు. వర్షాభావ పరిస్థితులు కొనసాగినా నగరంలో తాగునీటి కొరత ఏర్పడకుండా ప్రత్యామ్నాయ జల వనరులను వినియోగించేందుకు జలమండలి కార్యాచరణ చేపట్టింది. అలాగే నగరానికి అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, రోజువారీ అవసరాలు, భవిష్యత్ డిమాండ్‌పై సమగ్ర అంచనా వేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## పిల్లలను బావిలోకి తోసి తల్లి ఆత్మహత్య

**రంగారెడ్డి,జూలై 17 ఆంధ్ర ప్రగతి** రంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. శంకర్‌పల్లి మండలం కొత్తపల్లిలో ఇద్దరు పిల్లలను బావిలో తోసి, తల్లి ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా తాండూర్‌కు చెందిన వసంత (35), సుధాకర్ దంపతులు కొత్తపల్లికి వచ్చి స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు పిల్లలు. కూతురు (15), కొడుకు (10) ఉన్నారు. అయితే భార్యాభర్తల మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి గొడవ జరగడంతో ఇద్దరు పిల్లలను తీసుకుని వసంత బయటకు వచ్చేసింది. అనంతరం ఊరి చివర ఉన్న బావిలో ఇద్దరు పిల్లలను తోసేసింది. అనంతరం తాను బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. అయితే బావిలో తోసినప్పుడు బాలుడు చెట్టు కొమ్మకు చిక్కుకోవడంతో ప్రాణాలతో బయటపడినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బిల్లుల పాస్ కోసం బిజెపి వ్యూహం

### విపక్ష పార్టీలను బుట్టలో వేసుకునే యత్నం -ఈసారి రాజ్యాంగ సవరణ వీగిపోతే బిజెపి పరువు పోయినట్లే

**న్యూఢిల్లీ,జూలై 17ఆంధ్ర ప్రగతి**
గత పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులు వీగిపోవడంతో బిజెపి మరింత పట్టుదలగా అడుగులు వేస్తోంది. బిల్లులు ఆమోదింపచేసుకోవడానికి ఇదే సమయమని కమలనాథులు భావిస్తున్నారు. అయితే చర్చల ద్వారా ఏకాభిప్రాయం సాధించేందుకు మాత్రం ఆ పార్టీ ముందుకు రావడం లేదు. గత సెషన్‌లో బిజెపి వ్యూహాత్మకంగా ఉందని అంతా భావించారు. కానీ ఓటింగ్ సమయంలో దానికి వ్యూహం లేదని తేలిపోయింది. ప్రతిపక్ష పార్టీలే ఓ రకంగా వ్యూహాత్మకంగా నిలిచి తమ పట్టును నిలబెట్టుకున్నాయి. దీంతో రాజ్యాంగ సవరణ బిల్లులు బలం లేకపోవడంతో వీగిపో యాయి. ఇప్పుడు మరోమారు ప్రయత్నంలో బిజెపి వ్యూహం ఫలిస్తుందా లేదా అన్న చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో లోక్‌సభ సీట్లను 2011 జనాభా లెక్కల ఆధారంగానే పెంచడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ నెగ్గించుకోవాలన్న పట్టుదలతో భాజపా నాయకత్వం పనిచేస్తోంది. 2/3వ వంతు ఆధిక్యం లేకపోవడంతో బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లు వీగిపోవడం అధికారపక్షానికి ఇబ్బందికరంగా పరిణమించింది. తర్వాత ప్రతిపక్షం దూకుడు మొదలుపెట్టింది. ఇటీవల అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి.



తృణమూల్‌కు చెందిన 28 మంది లోక్‌సభ సభ్యుల్లో 20 మంది వేరుకుంపటి పెట్టుకొని అధికారపక్షానికి మద్దతు పలికారు. ఇండియా కూటమితో డీఎంకే తెగదెంపులు చేసుకుంది. ఈ రెండు అవకాశాలను అనుకూలంగా మలచుకునే పనిలో భాజపా నాయకత్వం తలమునకలైంది. ఇదివరకు డీలిమిటేషన్ బిల్లులో సీట్లపెంపు ప్రతిపాదన ఉన్నా దానికి ప్రాతిపదికను పెట్టలేదు. ఈసారి అలాకాకుండా.. రాష్ట్రాల్లో ఇప్పుడున్న సీట్లను 50శాతం మేర పెంచుతామని, దానివల్ల
లోక్‌సభలో ప్రాతినిధ్య నిష్పత్తి యథాతథంగా కొనసాగుతుందని భరోసా ఇవ్వడానికి బిజెపి సమాయత్తమైంది. ఈ మార్పునకు ఇప్పటికే ఇండియా కూటమిలోని శరద్‌పవార్ పార్టీ ఆకర్షితమైంది. 50శాతం సీట్లు పెంచేలా బిల్లులో స్పష్టత ఇస్తే మద్దతు ఇవ్వడానికి అభ్యంతరం లేదని ప్రకటించింది. డీఎంకే కూడా వ్యతిరేకించకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. భాజపా నాయకత్వం ఈ అంశంపై అన్ని పార్టీలతో తెరవెనుక మంత్రాంగం నెరపుతోంది. ప్రధానంగా డిఎంకె, శరద్ పవార్
నేతృత్వంలోని ఎన్సీపిలను బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. తృణమూల్ చీలిపోవడం, మరోపార్టీ ఇండియా కూటమికి దూరంగా ఉండటంతో తమకు ఇంతకంటే మంచి తరుణం రాదని భావించి.. మిగిలిన పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలను కమలనాథులు ముమ్మరం చేశారు. ఇప్పటికే భాజపా అత్యున్నత నాయకత్వం ప్రధానమంత్రి నివాసంలో దీనిపై చర్చించి వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం లోక్‌సభలో ఎన్డీయే కూటమికి 293 సీట్లున్నాయి. తృణమూల్ నుంచి విడిపోయిన 20 మంది, ఉద్ధవ్‌ఠాక్రే శివసేన నుంచి బయటపడిన ఆరుగురు ఎంపీలను కలిపితే ఆ సంఖ్య 319కి చేరనుంది. శరద్‌పవార్ పార్టీకి చెందిన 8 మంది మద్దతు లభిస్తే 327కి, డీఎంకే అండగా నిలిస్తే ఈ సంఖ్య 349కి చేరుతుంది. 2/3వ వంతు బలమైన 360ని చేరుకోవడానికి మరో 11మంది అవసరమవుతారు. వైకాపాకు చెందిన నలుగురు, ఒక స్వతంత్ర సభ్యుడు మద్దతు పలకడానికి సిద్ధంగా ఉన్నారు. అంటే ఇంకా ఆరుగురు తక్కువవుతారు. ఒకవేళ డీఎంకే గైర్హాజరైతే సభ సంఖ్యాబలం 518కి తగ్గుతుంది. అప్పుడు హాజరైనవారిలో 346 మంది మద్దతిస్తే చాలు. సభలోని 540 మంది హాజరైతేనే మెజార్టీకి 360 మంది అవసరం అవుతారు. మొత్తంగా బిజెపి వ్యూహం ఫలిస్తుందా లేకపోతే బెడిసి కొడుతుందా అన్నది చూడాలి.

# మాది ఇన్వెస్టర్ల ఫ్రెండ్లీ ప్రభుత్వం

### -రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

**అమరావతి, జులై 17ఆంధ్ర ప్రగతి**
భారత్ టెక్స్ -2026 ఈవెంట్ లో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్లిన రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మొదటి రోజు బిజీగా గడిపారు. పలువురు జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, కొనుగోలుదారులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల రాకకు, పరిశ్రమల స్థాపనకు తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని, ఇన్వెస్టర్లకు ఫ్రెండీ ప్రభుత్వమని తెలిపారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామంటూ, ఏపీలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి సవిత కోరారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాల కొనుగోలుకు సంబంధించి పలు ఆర్డర్లు సైతం చేనేత, జౌళి శాఖకు వచ్చాయి. ఈ నెల 14 నుంచి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అతిపెద్ద అంతర్జాతీయ టెక్స్‌టైల్ ప్రదర్శన భారత్ టెక్స్ -2026 ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ టెక్స్ ఈవెంట్లో రాష్ట్రానికి చెందిన టెక్స్ టైల్స్ ఉత్పత్తుల అమ్మకాలే లక్ష్యంగా మంత్రి సవిత రెండ్రోజుల పర్యటనకు గురువారం ఢిల్లీ చేరుకున్నారు. మొదటి రోజు పలువురు జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, కొనుగోలుదారులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో



ప్రపంచ ప్రఖ్యాత గాంచిన వివిధ ప్రాంతాల చేనేత వస్త్రాల ప్రాముఖ్యత తో పాటు ఆయా వస్త్రాల తయారీలో కలంకారీ నైపుణ్యం వినియోగంపైనా వారికి వివరించారు. ముఖ్యంగా రాష్ట్రంలో పెట్టుబడుల స్థాపనకు సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత వివరించారు. దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతానికి పైగా ఏపీకే తరలొస్తున్నాయన్నారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం నెలకొల్పేలా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ అండగా ఉంటున్నారన్నారు. తమది ఇన్వెస్టర్లకు ఫ్రెండ్లీ ప్రభుత్వమని మంత్రి సవిత స్పష్టంచేశారు. భారత్ టెక్స్ 2026లో ఏర్పాటు చేసిన ఏపీ పెవిలియన్ కు విశేష స్పందన లభిస్తోంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత ఉత్పత్తుల కొనుగోలుకు పలువురు జాతీయ, అంతర్జాతీయ కొనుగోలుదారులు ఆసక్తి చూపారు. ముఖ్యంగా చేనేత వస్త్రాలపై కలంకారీ చీరలు, ఇతర ఉత్పత్తులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

భారతదేశ అతిపెద్ద అంతర్జాతీయ టెక్స్‌టైల్ ప్రదర్శనకు విచ్చేసిన మంత్రి సవిత పలువురు పెట్టుబడిదారులు, కొనుగోలుదారులతో భేటీ అయ్యారు. అరవింద్ ఫ్యాబ్రిక్ సీఈవో డాక్టర్ పరమ్ షా, భారత్ టెక్స్ 2026 ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ నరేన్ గోయెంకాతో పలు అంశాలపై చర్చించారు. వారితో పలువురు విదేశీ కొనుగోలుదారులతోనూ చర్చలు జరిపారు. రెండోరోజు శుక్రవారం కూడా మంత్రి సవిత భారత్ టెక్స్ ఈవెంట్ లో పాల్గొనబోతున్నారు. సాయంత్రం ఢిల్లీలో ఆధునీకరించిన లేపాక్షి షో రూమ్ ను మంత్రి సవిత ప్రారంభించనున్నారు. అంతకు ముందు ఢిల్లీ పర్యటనకు వచ్చిన మంత్రి సవితకు కేంద్ర హ్యాండ్లూమ్ ఎక్స్ పోర్ట్ ప్రోమోషనల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్, ఏపీహెచ్డీసీ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరి ప్రసాదరావు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు ఘన స్వాగత పలికారు.